సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



అన్నదాతకు ఆసరా

అన్నదాతలకు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి.

10లో▸



విద్యుత్ తీగల ముఠా అరెస్ట్

విద్యుత్ తీగల చోరీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.

10లో▸



వృద్ధులకు కొండంత అండ

పిల్లలు పట్టించుకోక అనాథలైన వృద్ధులు.. ఒంటరైన వయోజనులకు రాచకొండ పోలీసులు బాసటగా నిలుస్తున్నారు.

10లో▸

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శ్రమదానంలో డీఆర్‌డీఓ శ్రీలత తదితరులు

యాచారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డీఆర్‌డీఓ శ్రీలత పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గడ్డమల్లయ్యగూడలో శ్రమదానం నిర్వహించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాలు కురుస్తున్న దృష్ట్యా తాగునీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి పైపులు లీకేజీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏటా మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ చరణ్‌సింగ్, ఎంపీడీఓ రాధారాణి, ఎంపీఓ శ్రీలత, ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగు నమోదు తప్పనిసరి



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష

మాడ్గుల: రైతులు పంటల సాగును తప్పనిసరి నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష సూచించారు. మండల పరిధిలోని ఇర్విన్, గిరికొత్తపల్లి, నల్లచెరువు, రామదుగ్యాల గ్రామాల్లో గురువారం పర్యటించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్, వ్యవసాయ శాఖ కార్యాలయాలను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు, నష్ట పరిహారం, రైతు భరోసా వంటి పథకాల లబ్ధి ఉంటుందన్నారు. నానో యూరియాతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందొచ్చన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి అరుణ కుమారి, విస్తరణ అధికారులు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

తుక్కుగూడ: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించాలని జిల్లా సంక్షేమాధికారి ఎల్.శ్రీలత అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లాస్థాయి పోషణ మాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బంది శిశువులకు సక్రమమైన ఆహారపు అలవాట్లు చేయాలన్నారు. జంక్‌ఫుడ్ వినియోగాన్ని తగ్గిస్తూ నూనె, చక్కర, ఉప్పు వాడకాన్ని పరిమితం చేయాలన్నారు. గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించి, ఆత్మనిర్భరతను పెంపొందించాలన్నారు. పోషకాహార లోపం నివారణలో అధికారులు, ప్రజలు సమష్టిగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి సెర్ప్ అధికారి లింగయ్య, సీడీపీఓలు, ఐసీడీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల గోస పట్టదా?



ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి

యాచారం: అన్నదాతలు గోస తీస్తున్నా పాలకులకు పట్టింపులేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నం పెట్టే రైతులు పంటలు పండించడానికి కావాల్సిన ఎరువులు కోసం కడుపు మాడ్చుకుని తెల్లవారుజామునే పీఏసీఎస్‌ల ముందు క్యూలో ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నారాయణరెడ్డి, నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, విజయ, అలీముద్దీన్, నీలమ్మ, అనంత్‌రెడ్డి, అండాలు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా భూములపై ఆరా

హైకోర్టు ఆదేశాల మేరకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం

- గ్రామాల వారీగా వివరాల సేకరణలో అధికారులు నిమగ్నం
- రెండు మూడు రోజుల్లో పూర్తి కానున్న ప్రక్రియ
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖతో అనుసంధానం చేయనున్న ప్రభుత్వం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: నిషేధిత జాబితాలో ఉన్న భూములపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామాల వారీగా ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ, సీలింగ్ భూములు సహా ఏసీబీ, సీబీఐ, ఈడీ, కోర్టు కేసులున్న భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం ప్రకారం ప్రత్యేక జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. నిజానికి ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. జాబితా రూపకల్పనపై క్షేత్రస్థాయి అధికారులకు పలు అనుమానాలు తలెత్తడంతో వివరాల సేకరణలో జాప్యం చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం కలెక్టర్ నారాయణరెడ్డి ఇదే అంశంపై సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లతో చర్చించి స్పష్టత ఇచ్చారు. 80 శాతం భూముల డేటాను ఇప్పటికే సేకరించి కలెక్టరేట్‌కు చేరవేశారు. రెండు మూడు రోజుల్లో మిగిలిన ప్రక్రియ పూర్తి కానుంది. ఈ నెలాఖరులోగా తుది జాబితా సిద్ధం చేసి హైకోర్టుకు సమర్పించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఐజీఆర్‌ఎస్‌లో ఒకలా.. రెవెన్యూలో మరోలా

భూ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పర్యవేక్షణ లోపానికి తోడు రెవెన్యూ యంత్రాంగంలో నెలకొన్న అవినీతి, అక్రమాలతో అనేక ప్రభుత్వ భూములు ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయి. జిల్లాలో మొత్తం 12,43,035 ఎకరాల భూములు ఉండగా, వీటిలో 2,18,530.2 ఎకరాల ప్రభుత్వ, 64,803 ఎకరాలు అటవీ, 90,911 ఎకరాలు అసైన్డ్, 21,931.03 ఎకరాల భూదాన్, 9,360.01 ఎకరాల దేవాదాయ, 14,785.17 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. ఇక 9000కు పైగా సీలింగ్ భూములు ఉన్నట్లు అంచనా. సర్వే నంబర్లు, విస్తీర్ణానికి విరుద్ధంగా రికార్డులు ఉన్నాయి. భూ విస్తీర్ణానికి మించి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. పాత పహాణీలకు భిన్నంగా ధరణి, భూ భారతి పోర్టల్‌లో భూముల స్వభావం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, కాస్తులో ఉన్న రైతుల పేర్లు నమోదయ్యాయి. పట్టా భూములు అసైన్డ్ భూములుగా.. సీలింగ్ భూములు పట్టాగా రికార్డయ్యాయి. సర్వే నంబర్‌లో ఒక రైతు కోర్టుకు వెళ్తే.. మిగిలిన రైతుల భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. పట్టా భూములను అసైన్డ్, సీలింగ్‌గా రికార్డు చేయడాన్ని సవాల్ చేస్తూ వందలాది మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ రికార్డుల్లో ఒకలా.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో మరోలా వివరాలు నమోదై ఉండటాన్ని హైకోర్టు సీరియస్‌గా తీసుకుంది. నిషేధిత జాబితాలో ఉన్న రికార్డులను పక్కగా సేకరించి పంపాల్సిందిగా రెవెన్యూశాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమైంది.

కోర్టు ఆదేశాలతో కదలిక

22-ఎలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలు ఉండగా, 22-1బిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన భూములు, 22-1సీలో వక్ఫ్, భూదాన్, దేవాదాయశాఖలకు సంబంధించిన భూములు, 22-1డిలో సీలింగ్ భూముల వివరాలు ఉంటాయి. 22-1ఇలో ఐటీ, ఈడీ, ఏసీబీ అటాచ్ చేసిన భూముల వివరాలతో పాటు కోర్టు కేసులకు సంబంధించిన సర్వే నంబర్లు ఉంటాయి. రెవెన్యూ రికార్డుల్లో ఒకలా .. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విభాగంలో మరోలా వివరాలు నమోదై ఉండటం అనేక వివాదాలకు కారణమవుతోంది. నిషేధిత జాబితా నుంచి తమ పట్టా భూములకు విముక్తి కల్పించాల్సిందిగా బాధితులు జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేక పోవడంతో వారంతా కోర్టును ఆశ్రయించారు. రెండు ప్రభుత్వ విభాగాల్లో ఆయా భూముల వివరాలు వేర్వేరుగా నమోదై ఉండటాన్ని కోర్టు తప్పు పట్టింది. పదిహేను వారాల్లోగా నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను సమర్పించాల్సిందిగా ఆదేశించింది. రెండు రోజుల క్రితమే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నా క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల్లో తలెత్తిన సందేహాలు జాప్యానికి కారణమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెవెన్యూ శాఖ ఇచ్చే నివేదిక ఆధారంగా ఎస్‌ఆర్‌ఓల భూ జాబితాలోనూ మార్పులు చేర్పులు చేపట్టే అవకాశం ఉంది.



కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ పండుగను గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, రెవెన్యూ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

– ఇబ్రహీంపట్నం రూరల్



దీన్ దయాల్ సేవలు మరువలేనివి



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: సమాజ సేవ, భారతీయ భావాలను ప్రపంచానికి చాటిన వ్యక్తి దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పుష్కరిణి సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంకోసం పనిచేసిన నాయకుల్లో ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎ.అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, నాయకులు కుంచం శ్రీనివాస్, వెంకట్‌రాంరెడ్డి, కృష్ణ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఆమనగల్లు: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రూ.10 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లు, భూగర్భ మురుగుకాలువలు, సురసముద్రం చెరువు సుందరీకరణ పనులకు గురువారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనిచేసే ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్‌చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మాణయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆ నియామకాలు చెల్లవు

- మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్ల నియామకంపై హైకోర్టు స్టే
- పాతవారినే కొనసాగించాలని ఉత్తర్వులు జారీ

మహేశ్వరం: ఇటీవల ప్రభుత్వం నియమించిన మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్ల నియామకం చెల్లదని.. పాత వారినే కొనసాగించాలని స్టే విధిస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ప్రభుత్వం మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్లుగా కొనసాగుతున్న మంచె పాండు యాదవ్, చంద్రశేఖర్‌ను తొలగించి వారి స్థానంలో డైరెక్టర్లుగా ఎన్నికైన చెన్‌రెడ్డి జయమ్మను మహేశ్వరం చైర్మన్‌గా, వెంకట్రామిరెడ్డిని కందుకూరు చైర్మన్‌గా నియమిస్తూ జీఓ జారీ చేసింది. దీనిపై మంచె పాండు యాదవ్, చంద్రశేఖర్ కోర్టును ఆశ్రయించారు. వారి వాదనలు విన్న కోర్టు కొత్త నియామకాలు చెల్లవని స్టే విధిస్తూ పాత వారినే చైర్మన్లుగా కొనసాగాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులపై పాత చైర్మన్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దొడ్డిదారిన తమని తొలగించి అధికార దుర్వినియోగానికి పాల్పడిందని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు.

ఓయూలో ఎన్నికల హోరు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగాల సంఘాల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఈ నెల 27న పలు ఉద్యోగ సంఘాల ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో గురువారం ఎన్జీఓస్ స్టాఫ్ అసోసియేషన్ అబ్దుల్ కదీర్ ఖాన్, బి.వెంకటేశ్ ప్యానెల్ 43 హామీలతో రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఓయూలోని నాన్ టీచింగ్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్జీఓస్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్ష అభ్యర్థి అబ్దుల్ కదీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి బి.వెంకటేశ్ మాట్లాడుతూ.. తమ ప్యానెల్‌లోని 9 మందిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తాము గెలిస్తే ఉద్యోగుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు పాటుపడతామన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు, సీపీఎస్, ఓపీఎస్ విధానం అమలు చేయిస్తామన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



మేనిఫెస్టో విడుదల చేస్తున్న అబ్దుల్ కదీర్ ఖాన్ తదితరులు

ఎల్మినేడు హెచ్‌ఎంకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలమండల శ్రీనివాస్‌ను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతూ వినూత్న రీతిలో బోధన చేస్తున్నందుకు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని బిర్లా ఆడిటోరియంలో గురువారం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందజేశారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, సినీనటులు రఘు కరుమంచి, పసునూరి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఎల్మినేడు గ్రామ సభ్యులు చక్రపాణి, విజయేందర్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడే బతుకమ్మకుంట ప్రారంభోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన బతుకమ్మ కుంటను శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం బతుకమ్మ కుంటను ఓ పిక్నిక్ స్పాట్‌గా అభివృద్ధి చేసి.. చుట్టూ పిల్లల ప్లే ఏరియాతో పాటు అనేక ఆకర్షణలు అందుబాటులోకి తెచ్చారు. వృద్ధులు సేద దీరేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. వాకింగ్ చేసే వారి కోసం చెరువు చుట్టూ నడక దారి, ఆక్రమణలకు తావు లేకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ చెరువు వరద నీటితో నిండు కుండను తలపిస్తుండటంతో బోటు షికారు కూడా అందుబాటులోకి వచ్చింది. బతుకమ్మకుంటను సీఎం నగర ప్రజలకు అంకితం ఇవ్వనున్నారు. బతుకమ్మ ఉత్సవాలను సైతం నిర్వహిస్తున్నారు.

మురుగు శుద్ధిలో ముందడుగు

- నేడు 39 అమృత్ ఎస్టీపీలకు సీఎం శంకుస్థాపన
- ఆరు ఎస్టీపీలను ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి



మూసీ పక్కన అంబర్‌పేట్‌లో ఎస్టీపీ

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణాసియాలోనే వంద శాతం మురుగును శుద్ధి చేసే తొలి నగరంగా రికార్డు సృష్టించేందుకు మహా హైదరాబాద్ సిద్ధమవుతోంది. రాబోయే పదేళ్ల వరకు ఉత్పత్తయ్యే మురుగును సైతం శుద్ధి చేసేందుకు ముందస్తు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో జలమండలి అడుగులు వేస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద మంజూరైన ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధమైంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 39 ప్రాంతాల్లో సుమారు 972 ఎమ్మెల్డీల సామర్థ్యంతో నిర్మించే ఎస్టీపీల పనులకు శుక్రవారం అంబర్‌పేట వద్ద సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న మరో 6 ఎస్టీపీలను ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు.

రెండేళ్లలో నిర్మాణాలు పూర్తయ్యేలా..

కేంద్రం అమృత్ 2.0 పథకం కింద మంజూరు చేసిన 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలను రెండు ప్యాకేజీల కింద నిర్మాణాలను పూర్తి చేసేలా జలమండలి చర్యలు చేపట్టింది. మొత్తం ఎస్టీపీల్లో ఒకటి పీపీపీ మోడ్‌లో.. మిగిలిన రెండు ప్యాకేజీల్లో 38 హైబ్రిడ్ అన్యూటీ మోడల్ (హ్యామ్)విధానంలో నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-1లో 16 ఎస్టీపీలు, ప్యాకేజీ-2లో 22 ఎస్టీపీలు నిర్మిస్తారు. మొత్తం అంచనా సుమారు రూ.3,849.10 కోట్లు. ఇందులో ఎస్టీపీల నిర్మాణ వ్యయం రూ. 2,569.81 కోట్లు. 15ఏళ్ల పాటు నిర్వహణకు రూ.1,279.29 కోట్లు వెచ్చించనున్నారు. ఎస్టీపీల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో కేంద్రం 30శాతం, రాష్ట్రం30 శాతం, నిర్మాణ సంస్థ 40 శాతం నిధులు సమకూర్చనుంది.

పదేళ్లలో 2,850 ఎమ్మెల్డీ మురుగు శుద్ధి

రాబోయే పదేళ్లలో మురుగు ఉత్పతి 2,815 ఎమ్మెల్డీ కావచ్చని జలమండలి అంచనా వేస్తోంది. అమృత్ 2.0 కింద 39 ఎస్టీపీలు పూర్తయితే 2,850 ఎమ్మెల్డీలను శుద్ధి చేసే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ అర్బన్ అగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 1950 మిలియన్ లీటర్ గ్యాలన్ల (ఎమ్మెల్డీ) మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఇందులో జీహెచ్‌ఎంసీ పరిధిలో 1,650 ఎమ్మెల్డీ ఉంటుంది. ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా 1,444 ఎమ్మెల్డీ మురుగు నీటిని శుద్ధి చేస్తోంది. మరో 332.5 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఆరు ఎస్టీపీలు అందుబాటులో రానున్నాయి. మిగిలిన రెండు పూర్తయితే 1,878 ఎమ్మెల్డీల మురుగు శుద్ధి చేయొచ్చు.

బాలాజీ సన్నిధిలో సంగీత దర్శకుడు



అర్చకుడు రంగరాజన్‌తో సంగీత దర్శకుడు గౌర హరి

మొయినాబాద్: బ్లాక్ బాస్టర్ విజయం సాధించిన 'మిరాయ్' చిత్ర సంగీత దర్శకుడు గౌరహరి చిలుకూరు బాలాజీని దర్శించుకున్నాడు. గురువారం దేవాలయానికి చేరుకున్న ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రంగారాజన్‌కు చిత్ర విశేషాలను తెలియజేశారు. చిత్రం యూనిట్ తరఫున చిలుకూరు బాలాజీకి కృతజ్ఞతలు తెలపడానికి వచ్చినట్లు చెప్పారు.

విద్యుత్ తీగల చోరీ ముఠా అరెస్ట్


విద్యుత్ తీగల చోరీ ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కడ్తాల్: పలు వెంచర్లలో విద్యుత్ తీగల చోరీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ గంగాధర్ పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని వివిధ వెంచర్లలో ఇటీవల దుండగులు విద్యుత్ స్తంభాల నుంచి అల్యూమినియం తీగలను రాత్రి వేళలో ఎత్తుకెళ్లారు. ఈ మేరకు యాజమానులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆమనగల్లు వైపు అనుమానాస్పదంగా వెళుతున్న కారులో ముఠాను పోలీసులు తనిఖీ చేశారు. వీరు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సత్యం చౌబే, ధీరజ్‌కుమార్, ఒడిశాకు చెందిన జనరోహన్, బిహార్‌కు చెందిన శ్యామ్‌బాబురామ్‌గా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడిన వీరు బృందంగా ఏర్పడి నగరంలోని జీడిమెట్ల ఉంటూ చోరీలు పాల్పడుతున్నారు. గూగుల్ లోకేషన్ ఆధారంగా కడ్తాల్ పరిధిలో విద్యుత్ తీగల చోరీలకు ప్రణాళికలు రచించారని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.40 వేల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్లు, మూడు కట్టర్లు, స్క్రూ డ్రైవర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ధీరజ్‌కుమార్ ఉన్నట్లు చెప్పారు. కేసును చాకచక్యంగా సీసీ కెమెరాలను ఉపయోగించి ఛేదించిన కానిస్టేబుల్ రాంకోటి, రాజశేఖర్‌లను అభినందించారు.

వృద్ధులకు పోలీసుల కొండంత అండ


వృద్ధురాలికి కిట్‌ను అందజేస్తున్న సీఐ రాఘవేందర్ రెడ్డి

పహాడీషరీఫ్: నవ మాసాలు మోసి కనిపెంచిన పిల్లలు పట్టించుకోకపోవడంతో అనాథలైన వృద్ధులు.. పిల్లలు విదేశాలలో ఉంటూ యోగా క్షేమాలు పట్టించుకోకపోవడంతో ఒంటరైన వయోజనులకు రాచకొండ పోలీసులు బాసటగా నిలుస్తున్నారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సౌజన్యంతో కమిషనర్ సుధీర్ బాబు పర్యవేక్షణలో కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఒంటిరిగా ఉంటున్న వయో వృద్ధులకు పోలీసులు అండగా ఉండేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేందర్ రెడ్డి స్థానికంగా ఉన్న దేవేందర్ నగర్ కాలనీ, రంగ నాయకుల కాలనీలలో నా అనే వారు లేక ఒంటరి జీవితం గడుపుతున్న వారిని గుర్తించి, వారి ఇళ్ల వద్దకే ఎస్ఐ దయాకర్ రెడ్డితో కలిసి స్వయంగా వెళ్లి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి ఆహార పదార్థాలతో కూడిన కిట్లను అందజేశారు. ఒంటరిగా జీవనం వెళ్లదీస్తున్న పెద్దలు ఎవరూ కూడా అధైర్య పడరాదని సూచించారు. సమాజంలో పౌరులకు ఆపద సమయంలో కూడా సేవలందించేందుకు పోలీస్ వ్యవస్థ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

రిహాబిలిటేషన్ సెంటర్‌లో దారుణ హత్య

- ముగ్గురి మధ్య గొడవ
- ఇద్దరు కలిసి ఓ వ్యక్తిని హత్య చేసిన వైనం


సందీప్ (ఫైల్)

మియాపూర్: రిహాబిలిటేషన్ సెంటర్(పునరావాస కేంద్రం)లో చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తులు కలిసి మరో వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన అతను మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల గ్రామానికి చెందిన సందీప్ (39) డ్రగ్స్‌కు అలవాటు పడటంతో కుటుంబ సభ్యులు అతడిని ఎనిమిది నెలల క్రితం మియాపూర్‌లోని రపా రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించారు. అదే సెంటర్‌లో నల్గొండకు చెందిన ఆదిల్, బార్సస్‌కు చెందిన సులేమాన్ కూడా గత రెండు నెలలుగా చికిత్స పొందుతున్నారు. గత కొన్ని రోజులుగా సులేమాన్, ఆదిల్, సందీప్‌ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కౌన్సెలింగ్ క్లాస్‌కు వెళ్లే సమయంలో సులేమాన్, ఆదిల్ సందీప్‌తో గొడవపడ్డారు. అతడిని కిచెన్ బాల్కానీలోకి తీసుకువెళ్లి కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సెంటర్ సిబ్బంది అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే తను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతుడు సందీప్ తండ్రి వెంకటనర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు సులేమాన్, ఆదిల్‌లను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కొత్తూరు సీఐగా నర్సయ్య

కొత్తూరు: కొత్తూరు నూతన సీఐగా నర్సయ్య బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ నర్సింహారావు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. షాద్‌నగర్ రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న నర్సయ్య ఈస్థానంలో విధుల్లో చేరనున్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడికి రిమాండ్


ప్రమోద్‌కుమార్

మంచాల: గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఛత్తీస్‌గఢ్ యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు అతన్ని రిమాండ్‌కు తరలించారు. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం ఆగాపల్లి బస్టాండ్ వద్ద ఉదయం 10:30 గంటలకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న ప్రమోద్ కుమార్ అలియాస్ నిసాత్ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని తనిఖీ చేశారు. మేస్త్రీగా పనిచేసే ప్రమోద్ నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. అక్కడి నుంచి న్యాయస్థానంలో హాజరు పర్చి, రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

మొయినాబాద్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం అజీజ్‌నగర్ పాత గేటు సమీపంలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయినట్లు గుర్తించారు. ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారని తెలిపారు. అతడి వయసు 35 ఏళ్లు ఉంటుందని నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఏవీనగర్ కాలనీలో ఉండే సరిత గత ఆదివారం నుంచి బుధవారం వరకు ఊరికి వెళ్లింది. మెయిన్ డోర్ తలుపులు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. తులంన్నర బంగారం, కిలో వెండి అపహరించుకుపోయారు. అలాగే రాములయ్య అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో కూడా తలుపులు పగలగొట్టి దొంగతనం చేశారు. తులం బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. గురువారం క్లూస్‌టీం వచ్చి పరిశీలించిందని సీఐ రవికుమార్ తెలిపారు.

అన్నదాతకు ఆసరా

కిసాన్ మాన్‌ధన్‌తో ఆర్థిక చేయూత

- వృద్ధాప్యంలో రైతులకు పింఛన్ ప్రయోజనం


మరియాపురంలో రసాయనాల పిచికారీ

షాబాద్: అన్నదాతలకు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. రైతులు వ్యవసాయం చేస్తున్న సమయంలోనే చాలా పథకాలు ఉపయోగ పడుతున్నాయి. వృద్ధాప్యంలో రైతులు ఆదాయ మార్గాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అందుకు వయసులో ఉండగానే కొంత ప్రీమియం చెల్లిస్తే వృద్ధాప్యంలో ప్రతీ నెల పింఛన్ రూపంలో ఆదాయం అందేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. 60 ఏళ్లు నిండిన రైతులకు ప్రతీ నెలా రూ.3వేల పింఛన్ అందించడం ఈ పథకం ఉద్దేశం.

నెలకు రూ.55 మాత్రమే

18–40 ఏళ్లున్న రైతులు ప్రతీ నెలా వారి వయసుల ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18 నుంచి 20 ఏళ్ల వరకు రూ.55లు చెల్లించాల్సి ఉంటుంది. రైతు రూ.55 చెల్లిస్తే కేంద్రం తన వాటాగా రూ.55 చెల్లించి మొత్తం రూ.110 ప్రీమియం చెల్లిస్తుంది. ఇలా 40 ఏళ్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏళ్ల తర్వాత సంబంధిత రైతుకు నెలకు రూ.3వేల పింఛన్ అందుతుంది. ఒకవేళ రైతు మరణిస్తే వారి నామినికి రూ.1,500 పింఛన్ అందజేస్తారు.

ఎవరు అర్హులు

18–40 ఏళ్ల ఉండి.. ఐదెకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. సొంత భూమి కలిగి పట్టా పాసుపుస్తకం ఉండాలి. జాతీయ పింఛన్ పథకం(ఎన్‌పీఎస్), ఈపీఎఫ్ పరిధితో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లింపుదారులు అనర్హులు.

దరఖాస్తు సులువే

పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కోసం ఆసక్తి, అర్హత ఉన్న రైతులు సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని రైతు నామిని, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. అనంతరం పింఛన్ కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు నుంచి ప్రీమియం నగదు చెల్లించాలి. ఆధార్ కార్డు, భూమి రికార్డు, బ్యాంకు ఖాతా పత్రాలు ఉండాలి.

ప్రీమియం చెల్లింపు ఇలా..

వయసు	18-20	21-24	25-29	30-34	35-39	40
ఫీజు	రూ.55	61	80	106	150	200


తిమ్మారెడ్డిగూడలో పత్తి చేనులో పనులు చేస్తున్న రైతులు

అవగాహన కల్పిస్తున్నాం

కిసాన్ మాన్‌ధన్ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతు వేదికల్లో జరిగే సమావేశాలతో పాటు వ్యక్తిగతంగా తెలియజేస్తున్నాం. ఈ పథకం వృద్ధాప్యంలో ఎంతో ఆసరాగా నిలుస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో సంప్రదించండి.

– కృష్ణమోహన్, ఏఓ, షాబాద్

ఉత్తమ చదువు.. ఉన్నత ఉద్యోగం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు గ్రూప్– 1 ఫలితాల్లో సత్తాచాటారు. వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు.

- గ్రూప్ –1 ఫలితాల్లో సత్తాచాటిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు


వర్షిత


దివ్య


మోనిక


మారుతి

లక్ష్యం.. ఐఏఎస్

ధారూరు: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వర్షిత గ్రూప్-1లో సత్తాచాటి డీఎస్పీగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు నరేందర్‌రెడ్డి, నవనీత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఏడుగా జాబ్ చేస్తూనే పోటీ పరీక్షలకు హాజరైన వర్షిత.. ఐఏఎస్ లేదా ఐపీఎస్ తన లక్ష్యమని తెలిపారు.

తొలి ప్రయత్నంలోనే..

మర్పల్లి: మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ధనసిరి దివ్య గ్రూప్– 1 మొదటి ప్రయత్నంలోనే ఉత్తమ ర్యాంకు సాధించి, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎంపికయ్యారు. తమ కూతురు సాధించిన విజయంపై తల్లిదండ్రులు రాణి, ప్రకాశ్ సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, గురువుల స్ఫూర్తితోనే ఉద్యోగం సాధించానని తెలిపారు.

కుల్కచర్ల నుంచి ఇద్దరు..

కుల్కచర్ల: గ్రూప్– 1 ఫలితాల్లో 263 ర్యాంకు సాధించిన కుల్కచర్లకు చెందిన మోనిక స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు. అదేవిధంగా తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మారుతి మున్సిపల్ కమిషనర్ పోస్టుకు ఎంపికయ్యారు.


జయకృష్ణ

సర్కారు బడిలో చదివి..

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన గడ్డమీది జయకృష్ణ గ్రూప్– 1 ఫలితాల్లో 378 ర్యాంకు సాధించి అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా ఎంపికయ్యారు. గతంలో విడుదలైన గ్రూప్– 2లో 94వ ర్యాంకు, గ్రూప్– 3లో 175వ ర్యాంకు సాధించాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం చదివిన జయకృష్ణ ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించడంపై అతని తల్లిదండ్రులు, స్నేహితులు హర్షం వ్యక్తంచేశారు.

యువతి అదృశ్యం


మమత (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్.వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన దిగుల్ల వెల్లస్వామి కుమార్తె దిగుల్ల మమత(22) స్థానికంగా ఉన్న ఆవిష్కరణ్ కంపెనీలో హౌస్ కీపింగ్ చేస్తుంది. రోజు మాదిరిగానే ఈ నెల 23న ఉదయం డ్యూటీకి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై కంపెనీలో అడగగా డ్యూటీ ముగిశాక రాత్రి 7 గంటలకు బయటకి వెళ్లిపోయిందని యాజమాన్యం సమాధానం ఇచ్చింది. ఆమె ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో, వెల్లస్వామి 24వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని.. కూతురి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ కలహాలతో ఓ యువతి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నోయల్‌రాజ్ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉండే శ్యామల ప్రగతి(19) బీఎన్‌రెడ్డినగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. వ్యక్తిగత సమస్యలతో నాలుగు నెలలుగా కళాశాల మానేసింది. రెండు రోజులుగా ఇంట్లో తల్లితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి ఇంట్లోనే ఉండి గదికి తలుపులు వేసుకుంది. సాయంత్రం తల్లి కిటికీలోంచి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ప్రగతి వేలాడుతూ కనిపించింది. గట్టు చప్పుడు కాకుండా కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తరలించే యత్నం చేయగా.. కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ పైనుంచి కింద పడి వ్యక్తి మృతి

మియాపూర్: మద్యం మత్తులో స్కూటీపై వెళుతుండగా కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ పర్వేద్ అహ్మద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రతన్ తీర్థోనీయా(41) నగరానికి వలసవచ్చి కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటూ స్థానికంగా ఓ హోటల్‌లో సర్వీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి అతను ప్రేమ్ నగర్‌లో తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. పార్టీ మధ్యలో మద్యం అయిపోవడంతో రతన్ మద్యం తెచ్చేందుకు న్యూ - హాఫీజ్‌పేటలోని వైన్స్ షాప్‌కు వెళ్లాడు. అయితే అప్పటికే మద్యం మత్తులో ఉన్న రతన్ నడిచి వచ్చేందుకు సాధ్యం కాకపోవడంతో తనను తీసుకెళ్లేందుకు తన స్నేహితుడు సిబ్బును రప్పించాడు. సిబ్బు రతన్‌ను స్కూటీపై రాంగ్ రూట్‌లో వెళ్తుండగా వెనుక కూర్చున్న రతన్ అదుపు తప్పి కిందపడ్డాడు. అతడి చేతిలో ఉన్న మద్యం సీసా పగిలి మెడకు గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు కొండాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు


రైతులతో మాట్లాడుతున్న డీఈ భిక్షపతి

తుర్కయంజాల్: ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు, పార్కు స్థలాల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి తెలిపారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని సర్వే నంబర్ 95లోని 4వేల గజాల భూమికి చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండగా గురువారం స్థానిక రైతులు కొందరు అడ్డుకున్నారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు డీఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డిలు అక్కడికి చేరుకుని రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి 4వేల గజాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉందని, దాని ప్రకారమే టెండర్ పిలిచి నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే సర్వే చేయించుకోవాలని, భూమి మీదని తేలితే నిర్మాణ పనులను నిలిపివేస్తామని తెలిపారు.

యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్ట్


ఆందోళన చేస్తున్న శ్వేత భర్త ప్రవీణ్ కుటుంబసభ్యులు

కీసర: నవ వధువును బలవంతంగా తీసుకెళ్లిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రేమ వివాహం చేసుకుందన్న కారణంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపల్లిలో శ్వేత అనే యువతిని ఆమె తల్లిదండ్రులు బుధవారం బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో శ్వేత భర్త ప్రవీణ్ అతడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కీసర పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ శ్వేత కిడ్నాప్ కేసులో ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. శ్వేత ఆచూకీ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎస్.ఐ శ్రీనివాస్‌రెడ్డితో శ్వేత తండ్రి ఫోన్‌లో మాట్లాడించారు. ప్రస్తుతం ఆమె తల్లిదండ్రుల వద్ద క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే ఆమెను కీసర పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి భర్తకు అప్పగించనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరగాళ్లపై సస్పెక్ట్ షీట్స్

రిపీటెడ్ అఫెండర్లపై తెరవాలని నిర్ణయం

- అనునిత్యం నిఘా, పర్యవేక్షణ కోసం ఇలా
- నేరగాళ్లలో బయటి రాష్ట్రాల వాళ్లే ఎక్కువ
- షీట్లు తెరిచినా వారిపై చర్యలు సాధ్యం కాని అంశమే

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఈ తరహా నేరగాళ్లను కట్టడి చేసేందుకు సిటీ పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పదే పదే ఈ నేరాలు పాల్పడే వారిపై సస్పెక్ట్ షీట్స్ తెరవనున్నారు. ఈ మేరకు ఈ ఠాణా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉన్న ఏసీపీ అందరూ ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లకు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కేటుగాళ్లపై నిరంతర నిఘా ఉంచడానికి, వారి కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే సిటీలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో పట్టుబడుతున్న నిందితుల్లో బయటి రాష్ట్రాలకు చెందిన వాళ్లే ఎక్కువ. ఈ నేపథ్యంలో సస్పెక్ట్ షీట్స్ లక్ష్యం ఎంత వరకు నెరవేరుతుందనేది వేచి చూడాల్సిందే.

బీఎన్ఎస్ అమలులోకి రావడంతో..

రౌడీలపై రౌడీషీట్, చోరులపై సిటీ డోషియర్ క్రిమినల్ (సీడీసీ) షీట్, సమస్యాత్మక వ్యక్తులపై హిస్టరీ షీట్, మత పరమైన నేరాలు చేసిన వారిపై కమ్యూనల్ షీట్, భూకబ్జాకోరులపై లాండ్ గ్రాబర్ షీట్ తెరవడం ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ పోలీసు మాన్యువల్‌లో అవకాశం ఉంది. నిర్ణీత కాలంలో ఒకటి కంటే ఎక్కువ నేరాలు చేసే రిపీటెడ్ అఫెండర్లపై వీటిని తెరుస్తారు. అయితే సైబర్ నేరాలు చేసే వారిలోనూ అనేక మంది రిపీటెడ్ అఫెండర్లు ఉంటున్నారు. ఒకరే అనేక నేరాలు చేస్తుండగా... పదేపదే చేస్తున్న వాళ్లూ ఉంటున్నారు. వీరి పైనా సస్పెక్ట్ షీట్స్ తెరిచే అవకాశం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు దక్కింది. దీంతో పేదేపదే, అనేక నేరాలు చేస్తున్న సైబర్ నేరగాళ్లపై పైనా సస్పెక్ట్ షీట్స్‌ను తెరవనున్నారు.

పటిష్ట నిఘా, పర్యవేక్షణకు అవకాశం...

ఇప్పటి వరకు అసాంఘిక శక్తులపై చట్ట పరిధిలో తెరుస్తున్న షీట్స్‌లో స్వల్ప మార్పులతో సైబర్ క్రైమ్ అధికారులు ఈ సస్పెక్ట్ షీట్లు నమోదు చేయనున్నారు. వీటిలో సదరు నేరగాడికి సంబంధించిన ఫొటో, చిరునామా, నమోదై ఉన్న కేసులు, నేరం చేసే విధానం సహా పూర్తి సమాచారం పొందుపరుస్తారు. ఈ వివరాలను తమ వద్ద ఉంచుకోవడంతో పాటు సదరు నేరగాళ్లు ఏ ఠాణా పరిధిలో నివసిస్తుంటే ఆ పోలీసు స్టేషన్‌కు పంపుతారు. ఆయా ఠాణాల్లో వీరి ఫొటోలను అందుబాటులో ఉంచుతారు. దీనివల్ల ఆయా చోట్ల పోలీసు అధికారులు మారినప్పటికీ వీరిపై పక్కా నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుందని పోలీసులు చెప్తున్నారు. నేరగాడి చిరునామా మారినప్పుడల్లా ఈ షీట్‌ను ఆ పరిధిలోని ఠాణాకు పంపిస్తారు.

ఆ పోలీసులు సహకరిస్తారా..?

నగరంలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో అరెస్టు అవుతున్న నిందితుల్లో బయటి రాష్ట్రాల వాళ్లు ఎక్కువగా ఉంటున్నారు. తమ ప్రాంతాల్లో ఎలాంటి నేర చరిత్ర లేని వీరు బయటి ప్రాంతాలను టార్గెట్‌గా చేసుకుని రెచ్చిపోతున్నారు. ఇలాంటి వారిపై ఇక్కడ షీట్ తెరిచినా ఉపయోగం లేదు. దీన్ని పరిగణలోకి తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు ఇలాంటి నేరగాళ్లపై షీట్లు తెరవడంతో పాటు ఆ వివరాలను వారు నివసిస్తున్న ప్రాంతం ఏ జిల్లా పరిధిలోని వస్తుందో ఆ జిల్లా ఎస్పీలకు లేఖ ద్వారా నివేదించాలని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉత్తరాదిలో ఉన్న అనేక పోలీసు విభాగాలు నేరగాళ్లతో ములాఖత్ అయి ఉంటున్నాయి. ఈ కారణంగానే వాళ్లు ఎంత వరకు సమర్థంగా నిఘా ఉంచుతారు, ముందస్తు చర్యలు తీసుకుంటారన్నది పోలీసులు సైతం స్పష్టంగా చెప్పలేకపోతున్నారు.

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచితే...

ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న, సాధారణ, సోషల్‌మీడియా వేదికగా జరిగే సైబర్ నేరగాళ్లపై తెరిచిన సస్పెక్ట్ షీటర్ల వివరాలను కేవలం పోలీసుస్టేషన్లలో ఉంచడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం సాధ్యం కాదనే వాదన ఉంది. సామాన్యులు, మోసగాళ్ల ఎత్తులకు ఆకర్షితులవుతున్న వారు ఠాణాలకు వెళ్లి వివరాలు సరి చూసుకోవడం సాధ్యం కాదు. ఇలాంటి వారి వివరాలను పోలీసు అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రత్యేక లింకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ ఇంటర్ నెట్ ద్వారా మోసాగాళ్ల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క ఈ షీట్లు తెరవాలనే నిర్ణయం వెనుక మరో కోణం ఉందని, సోషల్ మీడియా గొంతు నొక్కాలనే ప్రయత్నం ఉందనే విమర్శలూ వినిపిస్తున్నాయి.